# కన్నీటి స్వప్నం!

—అల్లం రాజయ్య

అతను కూర్చున్నాడు.. కూర్చుండి సిగరెట్లు కాలుస్తున్నాడు. అతని గదినిండా పీకలు తెగిన సిగరెట్లు—సిగరెట్లు కాలిన బూడిద—శ్మశానంలా గది—గదిలాగా అంతరంగం. అతని వయసు ముప్ఫయి దాటుండవచ్చు. మూతిమీద మీసం కట్టు—కళ్లల్లో చురుకుదనం.. అతను యుద్ధరంగంనుండి పారొచ్చిన ఖైదిలా ఉన్నాడు. ఉద్యమంనుండి ఉరుకొచ్చిన విప్లవకారునిలాగా ఉన్నాడు.. అతని మనసు వెలుగడి బడుతున్న అరణ్యంలాగా ఉంది.. అతని జుట్టు ఎక్కు పెట్టిన బాణం పుల్లల్లాగా ఉన్నాయి. అతను జుట్టు పీక్కోవడం లేదు. అంగి చింపేసుకోవడం లేదు. కాని సిగరెట్లు కాలుస్తున్నాడు. ఆలోచిస్తున్నాడు.

ఇవ్వాళ్ల మళ్లీ సాయంత్రమయ్యింది. నిన్నటి సాయంత్రంలాగే ఇవ్వాల్టి సాయంత్రం మళ్లీ గడిచి పోతోంది.. నిన్నలేని ప్రత్యేకత ఇవ్వాల్టికి లేదు. నిన్న జరిగిన సంఘటనల్లాగానే నేటి సాయంత్రం వెళ్ళి పోతోంది.. అయిపోయింది.. "ఐ" పోయింది. నా కండ్లు మూసుకు పోతున్నాయి. ఖవద్దారు..."ఐ" మీను నేను చచ్చి పోతున్నాను. అయిపోయింది.

"అయ్యో సాయంత్రం కూడా వెళ్లి పోయింది" అనుకున్నాడు గదిలోనిలబడి కిటికీ గుండా చిక్కబడుతున్న చీకటిని చూస్తూ.. వేగంగా పచారు చేస్తూ..

మళ్లీ పొద్దు క్రుంకుతోంది. సూర్యాస్తమయం.. కిటికీ నుండి దూరంగా కనిపించే కొండల వేపు చూసిండు—కొండల మీద ఆకాశం ఒంటినిండా రక్త—మయం—ఎవరో ఆకాశాన్ని హత్య చేసి వెళ్లిపోయినట్లున్నది.

"తర్వాత చీకటి..." అనుకుంటూ పచారు చేశాడు. గది నిండా చీకటి... కాళ్ల క్రింద సిగరెటు పీకల రోదన... అగ్గి పెట్టె కాబోలు చితికిపోయింది. తుర్కమన్ గేటు దగ్గర బుల్డోజరు క్రింద నలిగిపోయిన గుడిసెల్లా..

"టైమెంతయ్యిందో? కాలాన్ని పట్టి ఆపుతే.." అతనికి టైము తెలియలేదు. అతను కాలాన్ని ఆపలేదు. అందుకు సాక్ష్యంగా అతని గది బయట ప్రకృతి వెన్నెల మేస్తోంది. అతను ఆశ్చర్యంగా బయటికి చూశాడు.

"వెన్నెల పట్ట పగలల్లా నిన్నటికన్నా మెరుగ్గా.. మళ్లీ రాత్రి నిన్నటిలా నిద్ర పోతాను. కలల్ను తింటాను. నన్ను నేను దగా చేసుకుంటాను."

బయట రైలు మొత్తుకున్నది.. అతను ఉలిక్కి పడ్డాడు.

'రైలు వెళ్లిపోయింది.. పట్టాల్లాగా మసగ్గా మిగిలి పోయినదారి. టిక్కెట్టు లేకుండా ప్రమాదాలు లేకుండా (టిటి ల్లేకుండా) ప్రయాణించాలనుకున్నా కాని రైలెల్లిపోయింది.. మళ్లీ బాధ మిగిలి పోయింది.'

'మళ్లీ సాయంత్రాల బాధ పెడ్తాయి. నేను అన్నీ కోల్పోయాను. నేను అన్నీ ఆలోచిస్తున్నాను.. సాయంత్రాల్ని నమ్ముకొని పగల్లను పోగొట్టుకున్నాను. నేను ఆలోచిస్తూనే అన్నీ కోల్పోతున్నాను. నన్ను నేను ప్రమాదాల కంకితం చేసుకునే ధైర్యాన్ని నన్నునేను నిర్మించుకోవాల్సిన అవసరాన్ని నన్ను నేను త్యాగం చేసుకునే కర్తవ్యాన్ని మెల్లగా మెల్లమెల్లగా కోల్పోతున్నాను.'

చివరకు చరిత్ర తీర్పు చెప్తుతుంది.. ప్రజలు నన్ను పిరికిపందగా గుర్తిస్తారు. చేవలేని చావుకు భయపడే గుడ్డిగడ్డి వెధవను. గుడ్డిగవ్వను. పురుగులా నా ముఖాన్ని గాజు కిటికీ తలుపు కేసి కొట్టుకు కుళ్లి పోవాలనే తలంపు గలవాణ్ణే.. ఛీ..ఛీ నేను చాలా పిరికి వాణ్ణి.. అతను పిరికి ముఖం పెట్టాడు. అసహ్యంగా అసహనంగా అలజడిగా ఆ గదిలో పచారు చేశాడు..

నేను మళ్లీ అవకాశాల గూర్చి జీవితాల గూర్చి సుఖాల గూర్చి చొప్పదంటు బ్రతుకు గురించి ఆలోచిస్తున్నాను.. పంథాల గురించి మళ్లీ మళ్లీ తిరగదోడ్తున్నాను.. నా బొంద నేనే ఎన్నిసార్లు తోడి చూసుకోను..? మళ్లీ మింగుతున్నాను పిరికి విషాన్ని? అదిగో మళ్లీ కలలు కంటున్నా? పెదిమలు —ఎంగిలినిండి, పూసి, రసికారే పెదిమలు.. వక్షోజాలు.. చీరలు.. రంగురంగుల కంపు చెమట వాసన చీరెలు.. తడి.. గుండెదడ. పందుల్లా కుక్కల్లా, దొర్లడం.. బ్రతకడమంటే సెక్సుడం కాదు.. బ్రతకడమంటే పోరాటం.. పోరాటమంటే పిరికివాని చేతి ఆయుధం కాదు.. వీరుని చేతిలోని తుపాకి..

అతను పిడికిలిబిగించి అరచేతిలో గుద్దుకున్నాడు.. గుడ్లు తేలేసిన చంద్రుడు కిటికీ గుండా భయభయంగా ఆ గదిలోనికి తొంగి చూస్తున్నాడు. వానికి అతను కనిపించలేదు. అతనికి వాడి వెలుగులో గోడకు ఫోటో కనిపించింది. వెనక్కు చేతులు కట్టుకొని కాసేపు మవునంగా చూసిండు..

ఫోటోలో ఆమె గుంగురు వెంట్రుకల అమాయకమైన ఆడది. ఆమె ఒంటి చుట్టు నల్లరంగు వస్త్రాలు.. నుదుట బొట్టు.. పెదిమిల మీద దగాకోరు జీవితాన్ని నమ్ముకున్న ధీమా! ఆమె చేతుల్లో నోరు తెరిచి నవ్వడం తప్ప మరేది తెలియని అమాయకపు పిలగాడు..

ఆమె వెనుక అట్ట మీద మేడ మెట్లు.. అతను ఫోటోను గోడవేపు త్రిప్పిండు.

మళ్లీ బురదలోనికి పోతున్నాను.. ఒంటి నిండ బురద పూసుకొని ఇదే జీవితమని సంబర పడ్తాను. నిరాశలాంటి మత్తు మందుతో వాస్తవానికి చేతనైనంత దూరంగా పరుగెడుతున్నాను. నన్ను నేను హత్య చేసుకుంటున్నాను. నిజంగా నేను ఫెడౌట్ అవుతున్నా..

నిదలేమి కళ్ల బరువు. నేను సంతృప్తి పడలేని రాజీలేని పోరాటం జీవితం.. కాని పంథా పండ్లురాలగొడ్తోంది. నిజంగా నాకుతెల్సింది చాలా తక్కువ.. కాని ఆలోచించాలి.. చించాలి.. చించి..చించి చించి మళ్లీ కొత్తగా ఉత్సాహంగా ధైర్యంగా వీరునిలా పురుగులా కాకుండా చావో రేవో తేల్చుకోవాలి... అవును ఆలోచించాలి.. ఆలోచించుకుంటూడండగానే మళ్లీ సాయంత్రాలు వెళ్లి పోతాయి.. అడువులు పురిటినొప్పులు పడ్తున్నాయి. దేశాలు విముక్తిని కోరుతున్నాయి. జాతులు స్వేచ్ఛ కోరుతున్నాయి.. వ్యక్తులు సమిష్టి కోసం పోరాడ్తున్నారు. సూర్యుడు నిరంతరం జ్వలిస్తూనే ఉన్నాడు.

అతను ఏదో నిర్ణయించుకున్న వాడిలా అంగిలాగు ధరించాడు.. చే సంచి పట్టుకున్నాడు.

తలుపు చప్పట్లు గొట్టింది. గొళ్ళెం సెహబాషంది. తాళం 'చెలో' అంది.. అతని చెప్పులు దారిని చరిచాయి కోపంగా..

సుశీల నాలుగోనాడు తండ్రితో తన తనయునితో ఆ గది ముందు దిగింది. డూప్లికేటు తాళం తెరిచింది.. గది ఎప్పుడో చచ్చిన గజ్జి కుక్కలాగా ఉంది. గదిలోని టేబిల్ మీద కాగితం పగరుస్తున్న పులి నాలికలా ఎగురుతోంది. దాని మీద తాబేలులా పేపరు వేట్..

సుశీలా.. నాఫోటోల కోసం కూడా వెతుకకు.. నీ జీవితాన్ని నీ ఆలోచనల కనువుగా సాగించు.. మన ఉమ్మడి సంతానం సత్యంకు సత్యం గురించి తెలుపు.. ఇక సెలవ్..— నీ శ్రీవాత్సవ..

సుశీల ఏమిచేయాలో తోచక కూలబడిపోయింది.

